
కృష్ణకాలనీలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి


భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి 5, 6 వార్డుల్లో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న అభ్యర్థి గండ్ర, పక్కన నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

### రమణారెడ్డికే పట్టం కట్టండి

– ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, ప్రజల కష్టాలే తన కష్టాలుగా భావించి సేవలందించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికే పట్టం కట్టాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య అన్నారు. పట్టణంలోని గూడు లేని నిరుపేదలకు వెయ్యి డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇచ్చారన్నారు. భూపాలపల్లిని ఒక సంకల్పంతో అభివృద్ధి చేశారని, ఒక్క ఓటువేస్తే.. గండ్ర కుటుంబంలో ముగ్గురు సేవలందించారన్నారు. గండ్రను మూడోసారి గెలిపించి, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలని కోరారు.

# భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- మున్సిపాలిటీలోని 5, 6వ వార్డు ప్రజలు బీఆర్‌ఎస్‌కే ఓటేస్తామనడం ఆనందంగా ఉంది
- యాదవ కాలనీ, కృష్ణకాలనీ ప్రజలకు 560కి పైగా ఇండ్ల పట్టాలిప్పించిన
- పని చేసి ఓటు అడుగుతున్న.. ఆశీర్వదించండి
- కాంగ్రెస్ పాలనలో ఇంటింటికీ ఇన్వర్టర్లు, ప్రతి షాపులో జనరేటర్లు ఉండేవి
- బీఆర్‌ఎస్ పాలనలో 24 గంటలు ఇస్తున్నం
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, నవంబర్ 16 : భూపాలపల్లి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, 6వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల మౌనికా శ్రీనివాస్, పార్టీ 5వ వార్డు ఇన్‌చార్జి సింగనవేణి విజేత చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ పరిధిలోని 5, 6 వార్డులైన యాదవ కాలనీ, కృష్ణ కాలనీల్లో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి గండ్ర ప్రచారం చేశారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు మంగళహారతులు, పూలతో స్వాగతంపలికారు. అనంతరం మాట్లాడుతూ 1988లో సింగరేణి ఆవిర్భావం తరువాత కార్మికులు ఇండ్లు కట్టుకోవడానికి యాదవ కాలనీ, కృష్ణకాలనీ, సుభాష్ కాలనీల్లో ఇండ్ల స్థలాలు ఇప్పించినప్పటికీ నాటి ప్రభుత్వాలు పట్టాలు ఇవ్వలేదన్నారు. గత ఏడాది ప్రజలు తన దృష్టికి తేవడంతో సీఎం కేసీఆర్‌కు వారి పరిస్థితిని వివరించి 76 జీవో ద్వారా 560కి పైగా ఇండ్ల స్థలాలకు పట్టాలిప్పించినట్లు గుర్తు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.30 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్య తీర్చామన్నారు. కృష్ణకాలనీ, యాదవ కాలనీలపై ప్రత్యేక దృష్టిపెట్టి బోర్లు వేయించడంతో పాటు అవసరాన్ని బట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశామన్నారు. ఈ కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించామని, ఇంకా కొన్ని కావాలని కోరితే వాటి కోసం టెండర్లు కూడా పూర్తి చేశామన్నారు. రేపో మాపో పనులు ప్రారంభమవుతాయన్నారు. రూ.25 లక్షలతో కృష్ణకాలనీలో ఓపెన్ జిమ్, 2 పార్కులను నిర్మించినట్లు చెప్పారు. కృష్ణకాలనీ చివర 13 కుల సంఘాలకు 15 ఎకరాల భూమి కేటాయించి భవన నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల భవనాలకు ఐదెకరాల భూమితో పాటు నిర్మాణానికి రూ. 6కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. పట్టణానికి చివర ప్రాంతాల్లో శ్మశాన వాటికలు నిర్మించాన్నారు. సింగరేణి కార్మికులకు 32 శాతం లాభాల వాటా, ఏరియాలో వెయ్యి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12వేల వారసత్వ ఉద్యోగాలిస్తే, అందులో భూపాలపల్లి ఏరియాలో వెయ్యి మంది వారసులు ఉద్యోగాలు పొందారన్నారు. కాంగ్రెస్ దగాకోరు పార్టీ అని వారి పాలనలో కరెంట్ సరిగా లేక ఇంటింటికీ ఇన్వర్టర్లు, షాపుల్లో జనరేటర్లు ఉండేవన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో 24 గంటల కరెంటు ఇస్తుండడంతో వాటి ఊసేలేదన్నారు. తాను 15 ఏండ్లుగా నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తున్నానని, తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.


**బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు**

యాదవ కాలనీ, కృష్ణకాలనీలోని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 50 మంది నాయకులు బీఆర్‌ఎస్ 5వ వార్డు ఇన్‌చార్జి సింగనవేణి విజేత చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గండ్ర గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రచారంలో మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, కౌన్సిలర్లు పానుగంటి హారిక శ్రీనివాస్, జక్కం రవి కుమార్, సజ్జనపు స్వామి, నూనె రాజు, 5,6 వార్డుల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, శ్యామ్, పైడిపెల్లి రమేశ్, మేకల మల్లేశ్, యూత్ నాయకులు బుర్ర రాజు, శ్రీకాంత్ పటేల్, అశోక్, మహిళా నాయకులు తిరుపతమ్మ, స్వప్న పాల్గొన్నారు.

# నన్ను గెలిపించండి సమస్యలు పరిష్కరిస్తా

- రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..
- భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు
- చర్ల మండలంలో విస్తృత పర్యటన

చర్ల, నవంబర్ 16 : తనను నిండు మనస్సుతో గెలిపిస్తే నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు ప్రజలను కోరారు. గురువారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. సుబ్బంపేట నుంచి ప్రచారం ప్రారంభించిన ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను కలుస్తూ ఓటు అభ్యర్థించారు. పలు చోట్ల ఆయన మాట్లాడుతూ 30న ఓటింగ్‌లో పాల్గొని కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం పూసుగుప్ప, వద్దిపేట, ఉంజుపల్లి వెంకటచెర్వు, లెనిన్‌కాలనీ ఆదివాసీ గ్రామాల్లో ఓటర్లను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్సే అన్నారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఆయన పట్టించుకోకపోవడంతో భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధికి దూరమైందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, భద్రాచలం డివిజన్ సీనియర్ నాయకుడు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, ఎంపీపీ గీద కోదండరామయ్య, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, సీతాపతి రాజు, దొడ్డి తాతారావు, కాపుల నాగరాజు, దొడ్డి సూరిబాబు, అజీజ్, పోలిన రామచంద్రరావు, సోయం కృష్ణవేణి, పంజా రాజు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న భద్రాచలం అభ్యర్థి తెల్లం వెంకట్రావు


గాంధీనగర్ గ్రామంలో భారీ ర్యాలీగా వస్తున్న ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి


వృద్ధురాలికి నమస్కరించి ఓటు అభ్యర్థిస్తున్న నాగజ్యోతి

# ములుగులో ఐటీ కంపెనీ ఏర్పాటుకు కృషి చేస్తా

- యువత, మహిళల ఉపాధికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు
- అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టాలి
- ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

గోవిందరావుపేట, నవంబర్16 : ములుగు జిల్లాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. గురువారం గోవిందరావుపేట మండలంలోని ప్రూట్‌ఫారమ్, సోమలగడ్డ, రంగాపూర్, బాలాజీనగర్, సండ్రగూడెం, పాపయ్యపల్లి, గాంధీనగర్, కోటగడ్డ, రాఘవపట్నం, ఇప్పలగడ్డ, మాదాపురం, టపమంచ, ప్రాజెక్టునగర్, మొట్లగూడెం, నేతాజీనగర్‌తండా, అమ్మతండా గ్రామాల్లో ఆమె ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు నాగజ్యోతికి మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ ములుగు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించింది సీఎం కేసీఆర్ అన్నారు. గత ప్రభుత్వాలు తట్టెడు మట్టి కూడా పోయలేదన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. మహిళలు, యువతకు ఉపాధి కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తానని హామీ తెలిపారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**20 ఏండ్లుగా సీతక్క చేసిందేమీ లేదు**

ములుగు నియోజకవర్గంలో 20 ఏండ్లుగా సీతక్క చేసింది ఏమీ లేదని నాగజ్యోతి అన్నారు. గొత్తికోయల జీవన స్థితి గతులను సోషల్ మీడియాలో వివరిస్తూ వివిధ సంస్థల నుంచి సీతక్క నిధులు కూడబెట్టిందని ఆరోపించారు. వాటిని గిరిజనులకు ఉపయోగించకుండా ప్రస్తుత ఎన్నికల్లో ఖర్చు చేస్తుందన్నారు. అభివృద్ధికి అడ్డుగా ఉన్న కాంగ్రెస్‌ను ఓడించి, ప్రజా సంక్షేమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టాలని కోరారు. సౌభాగ్యలక్ష్మీ పథకంలో ప్రతి ఇంటికి రూ.3 వేలు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. అసైన్డ్ భూములకు పట్టాలు, భూములపై పూర్తి హక్కు కల్పించడంతో గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. దివంగత మంత్రి చందూలాల్ తనయుడు అజ్మీరా ధరమ్‌సింగ్ మాట్లాడుతూ మా నాన్న చనిపోయేంత వరకు బీఆర్‌ఎస్ లోనే ఉన్నారని తెలిపారు. కానీ, మా అన్న ప్రహ్లాద్ మాత్రం పార్టీకి మోసం చేసి తన స్వార్థం కోసం బీజేపీలో చేరి ద్రోహం చేశాడన్నారు. చందూలాల్ ఆశయ సాధన కోసం బడే నాగజ్యోతిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు.

**మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించండి**

– మండల ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు

అమ్మ నాన్న లేని ఆడబిడ్డ బడే నాగజ్యోతిని ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని మండల ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు ప్రజలను కోరారు. ఉన్నత విద్యావంతురాలైన ఆమెను గెలిపిస్తే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రచారంలో జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ సమ్మయ్య, మహిళా నాయకురాలు సుమలత, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.